390) గుండక్రియ

ప॥ హరి గోవిందా హరి గోవిందా। ఆనంద మానంద మాతుమకును।
గురూపదేశాన వెదకగా వెదకగా। గరము నీయర్థము కంటి మోయయ్యా॥

చ॥ సరి నన్యధర్మములు మానుమంటివి। శరణు నీకు జొరుమంటివి।
యితరము లణచేనంటివి। పరగ మోక్షం బిచ్చేనంటివి।
హరి నీవచనము అమోఘము। నరులము నే మిది నమ్మితిమి।
పరమపద మిప్పుడే కలిగెను। ధర నొక్కమనసుతో నున్నారమయ్యా॥

చ॥ యెందు నీవే గతి యనుమంటివి। యేచ యొక్కమాటే చాలునంటివి।
యిందరి కభయ మిత్తునంటివి। యిది నీ కెపుడు వ్రతమంటివి।
కందువ నీబిరుదు సత్యము। కానిమ్మని నేము చేపట్టితిమి।
అంది నీవే మాకు దిక్కైతివి। అన్నిటా సంతోసాన నున్నారమయ్యా॥

చ॥ ఆసమానినవా డెక్కు డంటివి। ఆతనివెంట దిరిగేనంటివి।
భాసురపాదరేణువు నే నంటివి। పావన మయ్యేనని యంటివి।
మోపలేనిది నీసంకల్పము। మొక్కే మిందులకు శ్రీవేంకటేశా।
ఆసపడ నితరుల నాకు నీవే యాస। యని నీదాసులమై యున్నారమయ్యా॥